# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

MARCH - 1999

# సంక్షిప్త వార్తలు

1999 జనవరి 29,30 తేదీలలో విజయవాడ క్రీస్తు రాజపురంలో సువార్త కూటములు జరిగెను. సువార్త కూటముల కొరకు స్థానిక క్రీస్తుసంఘము, చక్కటి ఏర్పాట్లు చేసిరి. సోదరులు జాషువా గూటం, పి. అబ్రాహాము (ముత్యాలపాడు), పి.షద్రక్ (గన్నవరం) గార్లు వాక్యపరిచర్య చేసిరి. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. క్రీస్తురాజపురంలో సోదరులు డి.సుభాకరరావ్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

ఫిబ్రువరి 17వ తేదీనాడు కృష్ణాజిల్లా మైలవరం మండలం చంద్రాలలో జరిగిన సువార్త కూటములలో మొదటిరాత్రి సోదరులు జాషువా గూటం గారు పాల్గొని వాక్యపరిచర్య గావించిరి. ఆ కూటములలో సోదరులు ఓర్సు ఆదాము, కె.బి.జె.వి. ప్రసాద్ గార్లు తదితర్లు వాక్యపరిచర్య చేసిరి. చంద్రాలలో ఓర్సు ప్రసాదరావ్ గారు తమ యింటివద్దనే నిర్మించిన ఆలయములో కూటములు జరిగెను. హాజరైన ప్రతివారు వాక్యమును ఆసక్తితో ఆలకించిరి.

ఫిబ్రువరి 18వ తేదీ గురువారం నాడు తిరువూరు మండలం మేడూరులో కృష్ణాజిల్లా సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. కృష్ణా, ఖమ్మం జిల్లాలనుండి పలువురు సువార్తికులు కూడిరాగా సదస్సు ప్రాంగణము ఆనందోత్సాహములతో నిండియుండెను. మేడూరులో వాక్య పరిచర్య గావించుచున్న సోదరులు సి.హెచ్. కాంతారావ్ గారు, స్థానిక సంఘము చక్కటి ఏర్పాట్లను చేసిరి. ఆరోజు "రక్షింప బడుటకు క్రీస్తు సంఘ సభ్యుడు కావలెనా ?" అను అంశము చర్చింప బడెను.

సదస్సును సోదరులు టి. ప్రసాదరావ్ (మైలవరం) గారు అధ్యక్షులుగా యుండి ఘనముగా నడిపించిరి. సోదరులు పి.సురేంద్రకుమార్ (మణుగూరు) గారి ప్రార్థనతో సదస్సు ప్రారంభమాయెను. సోదరులు ఆర్.ఇశ్రాయేలు గారు, వారి బృందము చక్కటి పాటలు నడిపించిరి. సోదరులు ఇందుపల్లి ఇశ్రాయేలు (తిరువూరు), కె.ఇశ్రాయేలు (కంభంపాడు), జాషువా గూటం (కాకినాడ), ఓర్సు నాగేశ్వరరావు (రెడ్డిగూడెం), పి. షద్రక్ (గన్నవరం) మొదలగువారు

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 63722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

**సంపుటి 19** **మార్చి 1999** **సంచిక 8**


## సంపాదకీయం

### సంఘావతరణము కొరకు క్రీస్తు మార్గమును సిద్ధపరచిన విధానము
(How Christ Prepared the way for the Coming of the Church)

గమనిక : ఈ పాఠమును చదువుటకు ముందు నీవు లూకా 24:49-53 మరియు అపొ.కార్యములు 2వ అధ్యాయమును పూర్తిగా చదువవలెను.

పరిచయము : క్రీస్తు రాకకొరకు దేవుడు ఈ లోకమును పలు విధాలుగా ఎట్లు సిద్ధపరచెనో అట్లే క్రీస్తు కూడా ఈ లోకమునకు వచ్చినప్పుడు తన సంఘావతరణము కొరకు మార్గమును సిద్ధపరచెను. ఆ సంఘము క్రీ॥శ 33వ సంవత్సరములో, యెరూషలేము పట్టణములో, క్రీస్తు పరమున కారోహణమైన తరువాత పెంతెకొస్తు దినమున అవతరించెనని నీవు ఇదివరకే గ్రహించి యుంటివి. క్రీస్తు రాకముందు సంఘావతరణమును గూర్చి దేవుడు ఏ విధమైన ఏర్పాట్లు చేయలేదని దీనియర్థము కాదు. వందలాది సంవత్సరములకు ముందునుండే

దాని రాక ప్రవచింపబడెను. దాని తేదీ నిర్ణయింపబడెను (దానియేలు 2:44).

దానిఁ ాు మాత్రమే గాక, మరి ముగ్గురు క్రీస్తు రాజ్యమైన సంఘమును గూర్చి ముందుగనే ప్రవచించిరి. వారు యోవేలు, యెషయా, మీకా అనువారు (యోవేలు 2:28; యెషయా 2:2-3; మీకా 4:1-2లను దయచేసి చదువండి). ఈ ప్రవక్తల ద్వారా అది "అంత్యదినములలో" (అపొ.కా. 2:16-17), పర్వతముల పైన (యెరూషలేములో) స్థాపించబడునని తెలిసికొనగలము, మరియు సమస్త జనులు ప్రవాహము వచ్చినట్లు దానిలోనికి వచ్చెదరు (అపొ.కా. 2). "యెరూషలేము నుండి యెహోవా వాక్కు బయలు వెళ్లినప్పుడు" అది స్థాపించ బడును (అపొ.కా. 2). అది స్థాపించబడే సమయం, దాని తత్వం, దాని రాకలో సంభవించే కొన్ని సంగతులను గూర్చిన వాస్తవములను గూర్చి తెలిసికొనుచు సంఘావతరణమును గూర్చి క్రీస్తు మార్గమును ఎట్లు సిద్ధపరచెనో గ్రహించుకొందము.

## సమీపించియున్న రాజ్యము

మనముందున్న దృశ్యమునొకసారి గమనించుదాం :

- బాప్తిస్మమిచ్చు యోహాను రాజ్యమును గూర్చి ప్రకటించినప్పుడు అది సమీపించి యున్నది యని బోధించెను (మత్తయి 3:2).
- యేసు కూడ రాజ్యమును గూర్చి బోధించినప్పుడు అది కూడ భవిష్యత్తులో సమీపముగా యున్నదని బోధించెను (మత్తయి 6:10; మార్కు 9:1).
- రాజ్యస్థాపనమును గూర్చిన ప్రవచనములన్నియు అపొ.కా. 2వ అధ్యాయములో పెంతెకొస్తు దినమున క్రీ॥శ 33లో నెరవేర్చబడెను.
- పెంతెకొస్తు తరువాత రాజ్యము స్థాపించబడి యున్నదని ఎల్లవేళలా చెప్పబడెను.
- సంఘము, రాజ్యము ఒక్కటే.

3.

## సంఘావతరణము కొరకు క్రీస్తు చేసిన ఏర్పాట్లు

క్రీస్తు ప్రజలకు, తన శిష్యులకు సంఘము ఎప్పుడు, ఎక్కడ ఎట్లు స్థాపించబడునో తెలియజెప్పుటయే గాక దానిలో సభ్యులగుట యెట్లో, అది యెట్లుండునో, దాని సభ్యులెట్లుందురో కూడ తెలియజెప్పెను, సంఘము యొక్క తత్వము ఎట్లుండునో ఆయన దృశ్య రూపకమైన ఉపమానముల ద్వారా చక్కగా బోధించెను.

### ప్రశస్తమైన సంఘము

- అది దాచబడిన ధనము గల పొలముతో పోల్చబడెను. ఒక మనుష్యుడు దానిని కనుగొని తనకు కలిగినదంతయు అమ్మి ఆ పొలమును కొనును (మత్తయి 13:44).

- అది మంచి ముత్యములను కొన వెదకుచున్న వర్తకుని పోలియున్నది. అతడు అమూల్యమైన యొక ముత్యమును కనుగొని, పోయి తనకు కలిగిన దంతయు అమ్మి దానికొనును (మత్తయి 13:45).

గమనిక : సంఘము ఏమంత ప్రాముఖ్యము కాదని డినామినేషన్ వారందురు. నీకిష్టమొచ్చిన సంఘములో చేరు అని వారు చెబుతారు. ఏ సంఘమైనా పరవాలేదు, అంతా ఒక్కటే యని వారంటారు. ఇంకా, రక్షింపబడాలంటే నీవు సంఘసభ్యుడవు కానక్కరలేదని వారు చెబుతారు. ప్రశస్తమైన రాజ్యమగు సంఘమును గూర్చి డినామినేషన్ వారి భావాలకు క్రీస్తుకు గొప్ప వ్యత్యాసమున్నది. యేసు ఏ రకమైన డినామినేషన్‌ను గూర్చి గాక, తన సంఘమును గూర్చి, దేవుని రాజ్యమును గూర్చి చెప్పియున్నారు. అది ఒక్కటి మాత్రమే ప్రశస్తమైనది, క్రీస్తును, ఆదిమ క్రైస్తవులును సంఘము కొరకు ఎక్కువ ధారబోసిరి, వారొక డినామినేషన్ కొరకు ఆ త్యాగములను చేసిరా ? కానేకాదు. ఆరోజుల్లో డినామినేషన్ అంటూ యేదీలేదు.

ఆనాడున్నదంతా క్రీస్తు సంఘమే. నేడు కూడా నమ్మకమైన క్రైస్తవులు చేయుచున్న త్యాగమును బట్టి సంఘము నిలిచియున్నది. వారొక డినామినేషన్ కొరకు త్యాగము చేయుదురా ? వారు క్రీస్తు సంఘముకొరకు త్యాగము చేయగలిగినప్పుడు ఒక మతశాఖ కొరకు, లేదా గుంపుకొరకు ఎందుకు త్యాగము చేయాలి ? మీరు మోసపోవద్దు. దేవుని రాజ్యము నాడు నేడు కూడ ప్రాముఖ్యమే యని క్రీస్తు బోధించెను. అది ఆయనకు ఎంత ప్రాముఖ్యమైనదో తెలిసికొను నిమిత్తము అపొ.కా. 20:28ని చదువుము. ఆయన దానికొరకు ప్రాణమర్పించెను.

సంఘము యొక్క పెరుగుదల

- అది ఆవగింజను పోలియున్నది. అది విత్తనములన్నిటిలో చిన్నదే గాని పెరిగినప్పుడు కూర మొక్కలన్నిటిలో పెద్దదై ఆకాశపక్షులు వచ్చి దానికొమ్మల యందు నివసించునంత చెట్టగును (మత్తయి 13:31-32).

- అది పులివంటిది, పిండి అంతయు పులిసి పొంగువరకు పిండిలో దాచిపెట్టిన పుల్లని (పులి) వంటిది. పిండినంతటికిని పులి ఎట్లు వ్యాపించునో, అట్లే సంఘము అన్ని జనాంగములకు, జాతులకు వ్యాపించును (మత్తయి 13:33).

- అది భూమిలో చల్లబడి మనుష్యునికి తెలియని రీతిగా మొలిచి పెరిగిన విత్తనము వంటిది (మార్కు 4:26-29). సంఘము యొక్క మర్మయుక్తమైన అభివృద్ధి ఎట్లో మనకు తెలియజెప్పబడలేదు. మనము విత్తనము విత్తి నీరు పోస్తే చాలు, అభివృద్ధి కలుగజేయువాడు దేవుడేయని మనము గ్రహించు కొనాలి (1కొరింథీ 3:7).

అది సముద్రములో వేయబడి నానా విధములైన చేపలను పట్టిన వలను పోలియున్నది. అది నిండినప్పుడు దరికిలాగి మంచివాటిని గంపలో చేర్చి చెడ్డవాటిని బయట పారవేయుదురు (మత్తయి 13:47-48).

5.

## సంఘము యొక్క బహిరంగ ఆహ్వానము - దానిని తిరస్కరించితే కలిగే ప్రమాదము

- క్రీస్తుసంఘము లేక రాజ్యము ఒక మనుష్యుడు గొప్ప విందును చేయించి అనేకులను పిలిచిన సందర్భమును పోలియున్నది. అయితే పిలువబడినవారు పలు సాకులు చెప్పసాగిరి. అందుకా యజమానుడు కోపపడి పలు వీధుల నుండి, సందులనుండి ప్రజలను పిలువనంపెను. "పిలయనగా పిలువబడిన ఆ మనుష్యులలో ఒకడును నా విందు రుచి చూడడని మీతో చెప్పుచున్నా నని" ఆ యజమానుడు పలికెను (లూకా 14:15-21).

- పరలోకరాజ్యము తన కుమారుని పెండ్లివిందును సిద్ధపరచిన ఒక రాజును పోలియున్నది. అయితే పిలువబడిన వారు ఆహ్వానమును నిర్లక్ష్యము చేసి అతని దాసులను పట్టుకొని అవమానపరచిరి. రాజు వారిని తగిన రీతిగా శిక్షించి కనబడువారందరిని పిలిపించెను గనుక వచ్చిన వారితో ఆ విందుశాల నిండెను. "కాగా పిలువబడిన వారనేకులు ఏర్పరచబడిన వారు కొందరే" అని ఆయన చెప్పెను (మత్తయి 22:1-14).

## రక్షింపబడుటకు అర్హతగల వారెవరో నిర్ణయించే న్యాయాధిపతి దేవుడే గాని మానవుడు కాదు

తన ద్రాక్ష తోటలో పని చేయుటకు వివిధ సమయాల్లో కూలివారిని పెట్టుకొని, సాయంకాలమున అందరికీ ఒకే రకమైన కూలీనిచ్చిన యజమాని యొక్క కధనము దీనికి దృష్టాంతముగా యున్నది. వారు ఎంతకాలము నుండి పనిచేసారో లేక ఎంత కష్టపడి చేసారోయనునది గాక, పని చేయుటకు వారు ఎంచుకోబడ్డారో లేదో యనునది గమనించదగిన విషయం. గనుక దినాంతము వచ్చుసరికి, తీర్పు తీర్చుటకు యజమానుడు వచ్చుసరికి సిద్ధముగా యుండుట అతి ప్రాముఖ్యము.

ఈ సందర్భములో ఆయన పనివారిలో నుండుట ఆయన కొరకు సిద్ధపడి యుండుటతో సమానము. ఆయన పనివారిలో యుండుట యనగా క్రీస్తు సంఘములో సభ్యులుగా యుండుటయే (మత్తయి 20:1-16).

## సంఘ సభ్యులెట్లుండాలి ?

### ఎల్లవేళలా సిద్ధపడియుండాలి :

పదిమంది కన్యకల ఉపమానము ఒక మంచి పాఠం. వారిలో ఐదుగురు బుద్ధి గలవారు, ఐదుగురు బుద్ధిలేనివారు. పెండ్లికుమారుడు రాగానే తమ దివిటీలను సిద్ధపరచుకొని ఎదుర్కొన వెళ్లిన వారు బుద్ధిగలవారిగ పరిగణించబడ్డారు. తమ దివిటీలను సిద్ధపరచకొనకుండ యున్నవారు బుద్ధిహీనులనబడిరి. బుద్ధిలేని కన్యకలకు తలుపు మూయబడెను. రెండవ తరుణము కొరకు వారు చేసిన విజ్ఞాపనలు తిరస్కరించబడెను. వారు సిద్ధపడి యుండలేదు (మత్తయి 25:1-13).

రాజుయొక్క కుమారుని పెండ్లివిందునకు పిలువబడిన వారిని గూర్చి చెప్పబడిన సందర్భములో, ఆఖరి నాలుగు వచనములలో పెండ్లి వస్త్రము లేక (సిద్ధపడక) యున్నవానిని గూర్చి చెప్పబడినది (మత్తయి 22:1-14). అతడు వెలపటి చీకటి లోనికి త్రోసి వేయబడెను. అతడు సిద్ధపడి లేడు! "కావున ఏ దినమున మీ ప్రభువు వచ్చునో మీకు తెలియదు గనుక మెలకువగా నుండుడి" యని యేసుప్రభువు హెచ్చరించెను (మత్తయి 24:42).

### వారు తమ తలాంతులను, సామర్థ్యమును ప్రభువు కొరకు ఉపయోగించాలి :

తలాంతులను గూర్చిన దృష్టాంతములో ఒకే ఒక్క తలాంతు కలిగి దానిని వినియోగించక పాతిపెట్టిన వాడు ఖండించబడెను. అట్లే తమ తలాంతులను వినియోగించని సంఘసభ్యుల విషయములో జరుగును (మత్తయి 25:14-30).

రాజకుమారుడొకడు పదిమంది దాసులకు పది మినాలనిచ్చిన ఉపమానము కూడ యిదే ప్రాధమిక సత్యాన్ని బోధించుచున్నది. ఇయ్యబడిన తలాంతును వినియోగింపని వానినుండి అది తీసివేయబడును, అతడు ఖండించబడును (లూకా 19:12-27).

ఇద్దరు కుమారులను గూర్చి చెప్పబడిన ఉపమానము, ఒకడు పోయి తండ్రి పొలములో పనిచేయుదునని చెప్పిపోలేదు, రెండవవాడు పోను అనిచెప్పి పోయి తన తండ్రి ద్రాక్ష తోటలో పనిచేసెను. యిది పనిచేయుటలో యున్న సుబుద్ధిని సూచించుచున్నది. గనుక మనమాడు మాటలు ప్రాముఖ్యమైనవి. మన చేష్టలు మాటలకంటే బలమైనవి (మత్తయి 21:28-32).

**వారు దీనమనస్సు గలవారై యుండాలి :**

దేవునిరాజ్యము చిన్నబిడ్డల వంటి మనస్సు గల వారిదని క్రీస్తు బోధించెను (లూకా 18:16-17). దీనమనస్సు తన శిష్యుల కుండవలసిన లక్షణమని ఆయన పలుమారులు బోధించెను. చిన్నబిడ్డలవలె (దీనమనస్సు కలిగి) దేవుని రాజ్యమును అంగీకరింపనివాడు దానిలో ఎంత మాత్రము ప్రవేశింపలేడని ఆయన బోధించెను.

**వారు దాక్షిణ్యము, క్షమా హృదయము గలవారై యుండాలి :**

దీనిని గూర్చి యేసు ఒక ఉపమానము చెప్పెను. ఒకడు తనయజమానికి పదివేల తలాంతులు అచ్చి యుండెను. అప్పు తీర్చుటకు అతని యొద్ద ఏమియు లేనందున అతడు తన యజమానుని బతిమలాడెను. ఆ దాసుని యజమానుడు కనికరపడి వాని క్షమించెను. అయితే ఆ దాసుడు బయటకు వెళ్లి తనకు నూరు దేనారములు అచ్చియున్న వాని గొంతు పట్టుకొని బలవంతము చేసెను. ఈ సంగతి యజమానుడు తెలిసికొని, కోపపడి తనకు అచ్చియున్నదంతయు చెల్లించువరకు బాధపరచు వారికి అతని అప్పగించెను (మత్తయి 18:23-25). క్రీస్తు సంఘ

(రాజ్య) సభ్యులకు యిదొక గొప్ప పాఠము. మన సహోదరుల అతి క్రమములను మనము క్షమింపని యెడల పరలోకపు తండ్రియు మన అతిక్రమములను క్షమింపడు. అందుకే "కనికరము గలవారు ధన్యులు వారు కనికరము పొందుదురు" అని యేసు బోధించెను (మత్తయి 5:7).

వారు అగ్రస్థానములను ఆశించరాదు :

దేవుని కుమారుడైన క్రీస్తు తన శిష్యుల పాదములు కడిగెను. తన్ను తాను తగ్గించు కొనెను. ఎందుచేత ? ఆయన ఈలాగు చెప్పెను. "ప్రభువును, బోధకుడనైన నేను మీ పాదములు కడిగిన యెడల మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని. దాసుడు తన యజమానునికంటె గొప్పవాడు కాడు, పంపబడిన వాడు తన్ను పంపిన వానికంటె గొప్ప వాడు కాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 13:1-17).

జెబెదయి కుమారుల తల్లి ఒక మారు యేసునొద్దకు వచ్చి తన యిద్దరు కుమారులకు ఆయన రాజ్యములో ప్రముఖ స్థానములు కావలెనని అడిగెను. తక్కిన పదిమంది శిష్యులు ఈ మాట విని ఆ యిద్దరు సహోదరుల మీద కోపపడిరి. అప్పుడు యేసు వారందరికీ ప్రాథమిక సత్యమునొక దానిని ఈలాగు బోధించెను : "మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను. మీలో ఎవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీదాసుడై యుండలెను" (మత్తయి 20:20-28).

గమనిక : పై కారణము వలన మత సంబంధముగా "భూమి మీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి. ఆయన పరమందున్నాడు" అని యేసు బోధించెను. కొందరు రెవరెండ్ అని పిలువబడతారు. ఆ మాట ఇంగ్లీషు బైబిలు అంతటిలో ఒకే ఒక్కమారు కనబడును. అది దేవునికే వర్తిస్తాది (కీర్తన 111:9).

అంతేగాకుండా క్రీస్తుసంఘ (రాజ్య) సభ్యులు ఒకరి యెడల ఒకరు పక్షపాతము గలవారు కాకూడదు. ధనవంతుడైన సహోదరుడు, బీదవాడైన సహోదరుడు ఆరాధనకు వచ్చిన యెడల ధనవంతుని యెడల పక్షపాతము చూపరాదు. వారిద్దరినీ సమానముగనే చూడవలెను (యాకోబు 2:1-6).

యితరులపై తమ్మును తాము హెచ్చించుకొనుటకు గాను క్రైస్తవులు నిలువుటంగీలు వగయిరాలు (ప్రత్యేక వస్త్రములు) ధరించు కొనకూడదు (మత్తయి 23:5-7). క్రీస్తు ఇంత విపులముగా బోధించితే పాదిరులు, గురువులనబడువారు యాజక వస్త్రములు ధరించుట యేల ?

## ముగింపు

పైన చెప్పబడినవి క్రీస్తు రాజ్యములో, లేక ఆయన సంఘములో యుండు వారికుండ వలసిన లక్షణములు. క్రైస్తవులు ఆయన రాకకొరకు ఎల్లవేళలా సిద్ధపడి యుంటూ, తమ తలాంతులను, సామర్థ్యమును ఆయన కొరకు వినియోగించుచు దీనమనస్సు, కనికరము, క్షమాహృదయము గలవారై సేవ చేయించు కొనువారు గాక సేవ చేయువారై యుండిన యెడల, మానవుల మధ్య ఉద్భవించే ఆత్మీయ సమస్యలన్నీ సులువుగా పరిష్కారమవుతాయి.

అయితే మానవులు క్రీస్తు యిచ్చిన ఈ ప్రాధమిక సూత్రములను మరచి పోయారు. వారు తమ స్వంత సిద్ధపాటు కంటే తమ పొరుగు వారి సిద్ధపాటును గూర్చి ఎక్కువ ఆసక్తి గలవారయ్యారు. ఈ జీవ సంబంధమైన వ్యాపారములలో వారెంత మట్టుకు చిక్కుకొన్నారంటే, వారు తమ తలాంతులను వారే మరచి పోయారు. వారు కనికరము, క్షమా హృదయము గలవారై యుండక, ఈర్ష్య పగ సాధించువారిగ తయారయ్యారు. దీనమనస్సు గలవారుగా యుండక, డాంబికులుగ గర్విష్టులుగా తయారయ్యారు. వారు అగ్రపీఠములను, అగ్రస్థానములను కాంక్షించుచు, రకరకాల బిరుదులను ధరించుచు క్రీస్తు బోధకు విరుద్ధముగా

ప్రత్యేక అంగీలను ధరించుకొనుచున్నారు.

ఈలాగున మనుష్యుల ప్రవర్తన, మనస్తత్వములో కలిగిన మార్పువలన సంఘమునకు సంభవించిన భ్రష్టత్వమును గూర్చి రాబోయే పాఠములలో నేర్చుకొందము. క్రైస్తవులు క్రీస్తు ఆజ్ఞలను నిరాకరించి తమ స్వంత అభిప్రాయములనే వెంటాడుటలో నేరుగా కలిగిన ఫలితమే విశ్వాస భ్రష్టత్వము.

ఈ పాఠము యొక్క దృష్టాంతము : ఆచరణలో మార్పు సంభవించుటకు ముందు ఆలోచనలో మార్పు సంభవిస్తాది. దేవుని వాక్యమైన బైబిలును గూర్చి మానవుల ఆలోచనలలో కలిగిన మార్పువలన క్రీస్తు తన సంఘము విషయమై చేసిన సంకల్పములో మానవులు తెచ్చిపెట్టిన మార్పులను వచ్చే పాఠములలో నేర్చుకొందము.

## బోధకుని ప్రాముఖ్యత

## (The Importance of the Preacher)

భారతదేశములో క్రీస్తును నమ్ముకొనిన వారిలో ఎక్కువమంది బోధకులున్నారు. దీనిని గూర్చి నేనే అనేక మారులు ఆలోచించాను. క్రైస్తవులయిన మగవారిలో ఎక్కువమంది బోధకులుగాను, 'సంపూర్ణ సువార్తికులు' గాను ఉండవలెనని ఎందుకు కోరుదురోయను సంగతిని గూర్చి కూడ నేను అనేక మారులు ఆలోచించాను. కొంతకాలము గడుచుసరికి అనేక రకాల బోధకులను కలసికొనుటలోను, మరి అనేకులతో ఈ అంశమును గూర్చి మాట్లాడుటలోను ఈ ప్రశ్నలకు నేను జవాబును కనుగొన్నాను.

ఈ పాఠములో బోధకుని మనము కొంత జాగ్రత్తగా పరిశీలించబోవుచున్నాము. బోధకుడెవరో, అతని పని ఏమిటో, మరియు ప్రభువు అతని నుండి ఏమి కోరుచున్నాడో తెలిసికొనబోవుచున్నాము. మనము సద్బోధకులను గూర్చి

దుర్భోధకులను గూర్చి తెలిసికొనుచు భారతదేశమునకు ఎట్టి బోధకులవుసరమై యున్నారో కనుగొందము. బైబిలు బోధించుదానిని బట్టి ఈ దిగువ సంగతులను జాగ్రత్తగా ఆలోచించుము.

1. బోధకుడు : నిర్వచనము :- బోధకుడెవరు ? అతడు దేవుని వాక్యమును బోధించువాడు. ఆదిమ క్రైస్తవులు "ప్రతిదినము దేవాలయములోను, ఇంటింటను మానక బోధించుచు యేసేక్రీస్తని ప్రకటించుచుండిరి" యని దైవవేదము చెప్పుచున్నది (అపొ.కా. 5:42). బోధకులు క్రీస్తు పరిచారకులని (Ministers), సువార్తికులని (Evangelists) పిలువబడిరి (రోమా 15:16; 2తిమోతి 4:5).

2. బోధకుని పని :- బోధకుని యొక్క పని క్రీస్తు సువార్తను బోధించుటయే. దేవుని వాక్యములో ఇది ఆజ్ఞ రూపముగాను, ఉదాహరణ రూపముగాను కనబడు చున్నది. ఉదాహరణకు పౌలు, పేతురు, ఫిలిప్పు మొదలగువారు గొప్ప బోధకులై యుండిరి (అపొ.కా. 2; 8; 17). మనము వారి పనిని గమనించినప్పుడు యేమి బోధించవలెనో యేమి బోధించకూడదో మనకు గ్రహింపగును. అట్టివి కొన్ని ఇక్కడ ఈయబడినవి:

"కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:19, 20)."మరియు - మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింప బడును" (మార్కు 16:15, 16). "దేవుని యెదుటను సజీవులకును, మృతులకును తీర్పు తీర్చు క్రీస్తు యేసు ఎదుటను, ఆయన ప్రత్యక్షత తోడు, నేను ఆనబెట్టి

చెప్పునదేమనగా, వాక్యమును ప్రకటించుము: సమయమందును, అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు, ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము" (2తిమో 4:1,2). "నీవు అనేక సాక్షుల యెదుట నావలన వినిన సంగతులను ఇతరులకు బోధించుటకు సామర్థ్యము గల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము" (2తిమో 2:2).

బోధించుటలో ఒకడు పాపులను మార్చవలెను, బలహీనులను బలపర్చవలెను, క్రీస్తు సంఘములను స్థాపించవలెను, సభ్యులను ప్రోత్సాహించవలెను, వారి అవుసరములలో పరిచర్య చేయవలెను, సువార్త కూటములు మొదలగునవి జరిపించవలెను.

3. బోధకుని ప్రాముఖ్యత : ప్రభువు దర్శనముల ద్వారాను, కలల ద్వారాను మానవునికి తన చిత్తమును బయలు పరచుటకు నిశ్చయించుకొనలేదు. రక్షణ సువార్తను మానవులకు అందించుటకు గాను ఆయన దేవదూతలను ఎన్నుకొనలేదు. ఇది నిజమని మనమెరుగుదుము. ఏలయనగా ప్రభువు సౌలుకు కనబడినప్పుడు, ప్రభువా, నేనేమి చేయవలెనని సౌలు అడుగగా, నీవు లేచి పట్టణములోనికి వెళ్ళుము, అక్కడ నీవు ఏమి చేయవలెనో అది నీకు తెలుపబడునని సౌలుకు తెలియజేయబడెను (అపొ.కా. 9:5,6). తరువాత అననీయ అతనియొద్దకు వచ్చి, "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగి వేసికొనుమని చెప్పెను" (అపొ.కా. 22:16). ఇప్పుడు ఏమి జరిగెనో గమనించుము: సౌలు రక్షింపబడవలెనంటే ఏమి చేయవలెనో క్రీస్తు అతనికి చెప్పలేదు. ఎందువలన ? ఎందువలనంటే, ఆయన సువార్తను మానవునికిచ్చెను, మానవుడే ఆ సువార్తనందించువాడై యుండవలెనని ఆయన ఉద్దేశించెను. సౌలు రక్షింపబడవలెనంటే ఏమి చేయవలెనో క్రీస్తు గనుక అతనికి తెలియజేసి యుంటే, మనుష్యులలో ప్రతివానికి రక్షింపబడవలెనంటే వారేమి చేయవలెనో వారికి వ్యక్తిగతముగా తెలియజేసే బాధ్యత ఆయన

అంగీకరించి యుండును, ఏలయనగా ఆయన పక్షపాతికాడు. గనుక ఆ బాధ్యతను అననీయకు, మిగిలిన బోధకులకు ప్రభువే అప్పగించెను.

అపొ.కా. 8వ అధ్యాయములో ప్రభువు దూత ఫిలిప్పునకు కనబడి అతనికొక సంగతిని చెప్పినట్లు మనము చూడగలము. దానిని ఇప్పుడు చదువుకొందము: "ప్రభువు దూత-నీవు లేచి దక్షిణముగా వెళ్ళి యెరూషలేము నుండి గాజాకు పోవు అరణ్యమార్గమును కలిసికొమ్మని ఫిలిప్పుతో చెప్పగా అతడు లేచి వెళ్ళెను. అప్పుడు ఐతియొపీయుల రాణియైన కందాకే క్రింద మంత్రియై ఆమె యొక్క ధనాగార మంతటి మీదనున్న ఐతియొపీయుడైన నపుంసకుడు ఆరాధించుటకు యెరూషలేమునకు వచ్చి యుండెను. అతడు తిరిగి వెళ్ళుచు తన రథము మీద కూర్చుండి ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండెను. అప్పుడు ఆత్మ ఫిలిప్పుతో - నీవు ఆ రథము దగ్గరకు పోయి దానిని కలిసికొనుమని చెప్పెను. ఫిలిప్పు దగ్గరకు పరుగెత్తికొనిపోయి అతడు ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండగా విని - నీవు చదువునది గ్రహించుచున్నావా ? అని అడుగగా అతడు ఎవడైనను నాకు త్రోవ చూపకుంటే ఏలాగు గ్రహింపగలనని చెప్పి, రథమెక్కి తనతో కూర్చుండుమని ఫిలిప్పును వేడుకొనెను. అతడు లేఖనమందు చదువుచున్న భాగమేదనగా - ఆయన గొఱ్ఱెవలె వధకు తేబడెను; బొచ్చు కత్తిరించువాని యెదుట గొఱ్ఱెపిల్ల ఏలాగు మౌనముగా ఉండునో ఆలాగే ఆయన నోరు తెరవకుండెను. ఆయన దీనత్వమును బట్టి ఆయనకు న్యాయవిమర్శ దొరకక పోయెను. ఆయన సంతానమును ఎవరు వివరింతురు? ఆయన జీవము భూమిమీదనుండి తీసివేయబడినది.

"అప్పుడు నపుంసకుడు-ప్రవక్త యెవనిని గూర్చి యీలాగు చెప్పుచున్నాడు? తన్ను గూర్చియా, వేరొకని గూర్చియా ? దయచేసి నాకు తెలుపుమని ఫిలిప్పు నడిగెను. అందుకు ఫిలిప్పు నోరు తెరచి, ఆలేఖనమును అనుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను. వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్లున్న

యొకచోటికి వచ్చినప్పుడు నపుంసకుడు - ఇదిగో నీళ్ళు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమేని అడిగి రధము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు, నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలోనుండి వెడలివచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను. నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను" (అపొ.కా. 8:26-39).

రక్షింపబడవలెనంటే ఏమి చేయవలెనో ఈ నపుంసకునికి ఎవరు బోధించిరి? మన రికార్డు ప్రకారము ఫిలిప్పు బోధించెను. ప్రభువు దూతయే ఎందుకు బోధించ లేదు ? ఏలయనగా సువార్త వాక్యమును దూతల ద్వారా బోధించుట దేవుని చిత్తము కాదు. కొర్నేలికిని అతని యింటి వారికిని పేతురు సువార్తను బోధించు నట్లు వారిద్దరిని దేవుని దూత సమకూర్చుటను మనము అపొ.కా. 10వ అధ్యాయములో మరల చూడగలము. కొర్నేలికి దేవదూత సువార్త బోధించ గలుగును. గాని అతడు బోధించలేదు.

కొరింధులోని సహోదరులకు వ్రాయుచు అపొ.పౌలు దీనినంతటిని ఇట్లు విపులీకరించెను : "అయినను ఆ బలాధిక్యము మామూలమైనది కాక దేవునిదై యుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు" (2కొరింథీ 4:7). దాని యర్ధమిది : మంటి ఘటములైన మనుష్యులకు ప్రభువు సువార్తను అప్పగించెను. గనుక యితరులకు దానినందించు బాధ్యత మనదే అయ్యున్నది. మనము మనకుగా ఏమి చేసికొనగలమో ప్రభువు మనకొరకు దానిని చేయడు.

ప్రభువు వ్యక్తిగతముగా కనబడెనని లేక దర్శనమిచ్చెనని లేక కలలో కనబడి వారిని తక్షణమే రక్షించెనని కొందరు చెప్పుచుందురు. మరికొందరయితే ప్రభువు దూత వారికి ప్రత్యక్షమై రక్షణ పొందుటకు వారేమి చేయవలెనో వారికి తెలియజెప్పెనని చెప్పుకొందురు. అయితే అట్టివారు పొరబడుచున్నారు. మోసపోవు మన్నారు. దేవుని కుమారుడు అట్టి పనిని దేనిని చేయడు సరిగదా అట్టి పనిని

జరిగించుటకు ఆయన ఒక దూతను ఎన్నడు పంపించడు. ఒకవేళ దూతలు అగుపడినను, రక్షింపబడవలెనంటే ఏమి చేయవలెనో వారు తెలియజెప్పరు, ఎందువలననగా ప్రభువు తన ప్రజలకు సువార్త నిచ్చెను. దానిని ఇతరులకు బోధించి ఉపదేశించు బాధ్యత వారిదై యున్నది.

అయితే ఒకవేళ దేవుని దూత అగుపడి రక్షింపబడుట కేమి చేయవలెనో తెలియజెప్పగలడనుకుందాము. అతడేమి చెప్పగలడు ? పౌలు ఇట్లనుచున్నాడు: "క్రీస్తు కృపను బట్టి మిమ్మును పిలిచిన వానిని విడిచి, భిన్నమైన సువార్త తట్టుకు మీరింత త్వరగా తిరిగి పోవుట చూడగా నాకాశ్చర్యమగుచున్నది. అది మరియొక సువార్త కాదుగాని, క్రీస్తు సువార్తను చెరుపగోరి మిమ్మును కలవరపరుచు వారు కొందరున్నారు. మేము మీకు ప్రకటించిన సువార్త గాక మరియొక సువార్తను మేమైనను పరలోకము నుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక. మేమిదివరకు చెప్పిన ప్రకారము ఇప్పుడును మరల చెప్పుచున్నాము; మీరు అంగీకరించిన సువార్తగాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాపగ్రస్తుడవును గాక" (గలతీ 1:6-9). అతడొక పవిత్రమైన సువార్తను బోధించినట్లు పౌలు ఇక్కడ చెప్పుచున్నాడు. అయితే మరెవడైనను (అతడు బోధించిన దానికంటె) భిన్నమైన సువార్తను బోధించిన యెడల అతడు దేవుని వలన శపించబడునని అతడు హెచ్చరించినను. అతడింకా ఏమనుచున్నాడంటే అతడిదివరకు బోధించిన దానికంటే భిన్నమైన సువార్తను అతడైనను, వేరొక మనుష్యుడైనను లేక దేవదూతయైనను బోధించిన యెడల వాడు శాపగ్రస్తుడవును. గనుక ప్రభువైనను లేక దేవదూతయైనను ఒకనికి అగుపడి రక్షణ పొందవలెనంటే ఏమి చేయవలెనో వానికి చెప్పుటలో ప్రయోజన మేమియును లేదు. ఏలయనగా వారొక వేళ అగుపడినను బైబిలునందేమైతే యున్నదో దానినే వారు తెలియజెప్పవలసియుండును. ఇది గమనించదగిన విషయము. గనుక నీవు రక్షణ పొందుటకు ఏమి చేయవలెనో తెలిసికొనవలెనంటే, నీవు దేవుని

వాక్యమునొద్దకు వెళ్ళవలెను (2తిమో 3:16,17). దానికి భిన్నమైన దేమైనను అది అసత్యము. దానికి వేరైన దానిని ఏమైనను ఎవడైనను బోధించుచున్న యెడల అతడు అబద్ధ బోధకుడు. ఆనాడు అది ఎంత సత్యమో ఈనాడు కూడ అంతే సత్యము.

4. బోధకుని పిలుపు : దేవుని సత్యమును ఇతరులకు బోధించే బాధ్యతను క్రైస్తవులందరు కలిగియున్నారు. బహిరంగముగా బోధించుటలో అయితే, శక్తి సామర్ధ్యములు, ఆసక్తి, తరుణములు గల ప్రతి క్రైస్తవ పురుషుడు సువార్తను బోధింపవచ్చును. అయితే యిట్టివారెట్లు పిలువబడిరి ? పౌలు ఇట్లనుచున్నాడు : "మీరీలాగున రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని ఆయన మా సువార్తవలన మిమ్మును పిలిచెను" (2థెస్స 2:14). ఇంకొక మాటలో సువార్త బోధింపబడగా ఒకడు విని దానికి విధేయత చూపించి, ఇతరులకు దానిని బోధింప మొదలిడును. దేవుడతనిని సువార్త ద్వారా లేక వాక్యము ద్వారా పిలిచెను.

బోధకుని పిలుపును గూర్చి యున్న ఆధునిక తలంపులు బైబిలు బోధించు దానికి వ్యతిరేకముగా యున్నవి. ఒక వ్యక్తికి దేవుడు అద్భుతమైన సూచనలను చూపించునని గాని లేక ఒక వ్యక్తికి ఆయన దర్శనమిచ్చి అతనిని సువార్త బోధించుటకు పిలుచునని గాని బైబిలు ఎక్కడను బోధించుట లేదు. బోధకుని అభిషేకించుటకు గాను ప్రత్యేక కూటము నేర్పాటు చేయవలెనని కూడ బైబిలు బోధించుటలేదు. సువార్తను ఇతరులకు అందించవలెనని ప్రభువు అపొస్తలులకు బోధించెను.మార్పుజెందిన వారికి వారు బోధించిన యెడల వారు కూడ యితరులకు బోధింప గల్గుదురు (మత్తయి 28:19,20).

5. బోధకుని అర్హతలు :- ఎవరికిబడితే వారు దేవుని నిజ బోధకులు కాజాలరు. అన్నింటివలె బోధకునికి కూడ కొన్ని అర్హతలున్నవి:

(a) అతడు క్రైస్తవుడై యుండవలెను. సరిగదా నమ్మకమైన క్రైస్తవుడై యుండవలెను (అపొ.కా. 26:2; 11:26). యితరులు ప్రభువునకు విధేయత చూపుటకు ప్రోత్సాహింప గల్గునట్లు మొదట అతడు ఆయనకు విధేయుడై యుండవలెను (హెబ్రీ 5:8-10). యితరులు అతని మాట వినగల్గునట్లు అతడు బోధించు దానినతడు అనుసరింపవలెను (మత్తయి 5:16).

(b) అతడు బైబిలు నందగుపడుచున్న ఒకే ఒక్క నిజ సంఘసభ్యుడై యుండవలెను (మత్తయి 16:18; అపొ.కా. 2:47). అతడొక మతశాఖ సభ్యుడయిన యెడల బైబిలు బోధించునది గాక మానవకల్పిత బోధను అతడు బోధించు చున్నాడని యర్ధము. అతడు కొంత మట్టుకు బైబిలును బోధించినను అందు మానవ కల్పిత బోధలు మిళితము చేసి బోధించును. అయితే ఈరెండు సందర్భములలో యున్నట్టి బోధను మాత్రము ప్రభువు కోరుటలేదు.

(c) అతడు పవిత్రమైన క్రీస్తు సువార్తను బోధించవలెను (రోమా 1:16,17). అతడు తనను గూర్చి గాని, మనుష్యుల ఉపదేశములను గాని, రాజకీయము గాని, సాంఘిక సువార్తను గాని బోధింపక పౌలు వలె దేవుని సంకల్పమునంతటిని బోధింపవలెను (అపొ.కా. 20:27). అతడు సత్యమును, సంపూర్ణ సత్యమునే బోధింపవలెను గాని వేరొక దానిని కాదు (యోహాను 17:17; 8:32). అతడు క్రీస్తు యొక్క మరణము, సమాధి, పునరుత్థానములను బోధింపవలెను (1కొరింథీ 15:1-4). క్రీస్తు కన్య మరియకు జన్మించెనని కూడ అతడు బోధింపవలెను (మత్తయి 1). లేఖనములలో వ్రాయబడిన ఆయన చేసిన అద్భుతములను (యోహాను 20:30,31), మరణానంతరమున్న జీవితములో సంభవించు బహుమానములను లేక శిక్షను గూర్చి కూడ అతడు బోధింపవలెను (యోహాను 5:28, 29; 14:1-3).

(d) అతడు బైబిలును బాగుగా ఎరిగిన వాడై యుండలెను. నాకు బైబిలు బాగుగా తెలుసు అని చెప్పుకొనుచున్న బోధకుని నేను కొన్ని దినముల క్రితము కలసికొంటిని. మలాకీ నుండి మత్తయి వరకు బైబిలు నాకు బాగుగా వచ్చు అని అతడు చెప్పుకొను చుండెను! నిజానికి చాలమంది బోధకులు ఎరిగిన బైబిలుకూడ అంతే. బైబిలు ఏమి బోధించుచున్నదో ఒకడు ఎరుగని యెడల అతడు ఎట్లు బోధింపగలడు? నీకు తెలియని దానిని నీవు బోధింపలేవు గదా. బైబిలు ఏమి బోధించుచున్నదో ఒకడు ఎట్లు తెలిసికొనగలడు? కొందరయితే ప్రభువు ఏదో వర్తమానము నిచ్చునని కనిపెట్టుచుందురు. అందువలన వారేమియు బోధింపలేరు. నీవు బైబిలును బాగుగా ఎరుగవలెననిన దానిని పఠించుము, దీర్ఘముగా పఠించుము. యౌవన బోధకుడైన తిమోతికి పౌలు ఇట్లు చెప్పెను: "దేవుని యెదుట యోగ్యుని గాను, సిగ్గుపడనక్కరలేని పనివాని గాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" (2 తిమో 2:15).

(e) అతడు కొంతమట్టుకు చదువుకున్నవాడై యుండవలెను. జ్ఞానము గలవారికి బోధించువాడవైతే, నీమట్టుకు నీవు కొంత చదువుకొన్నవాడవు కావలెను. నీకంటె ఎక్కువ తెలిసినవారికి నీవు ఎట్లు బోధించగలవు ? ఏమయితే చెప్పవలెనో దానిని నీవు సరిగ్గా చెప్పలేని యెడల నీవు ఎట్లు ఉపదేశించగలవు ? నీవు బోధించవలెనంటే ఇంతమట్టుకు చదువుకొనవలెనని ప్రభువు తన వాక్యమందు చెప్పలేదు, నిజమే. అయితే సత్యమును బోధించుటలో నీవు అజ్ఞానుడవై యుండవలెనని కూడ ఆయన చెప్పలేదు. యేసు మానసికముగాను (అనగా విద్యలోను), ఆత్మీయముగాను, సాంఘికముగాను, భౌతికముగాను పెరిగెను (లూకా 2:52). పౌలు చాల ఉన్నత విద్య నభ్యసించినవాడు. తద్వారా అతడెంత చేయగలిగెనో గమనించుము. అతడు దీనులకు, బీదలకు బోధించగలిగెను. అయితే అతడు రాజుల యెదుట కూడ నిలబడి క్రీస్తుని గూర్చి వారికి బోధించ

గలిగెను. మనము బోధించువారమైన యెడల, దానిని సక్రమముగా చేయగల్గునట్లు తగిన రీతిగా మనము సిద్ధపడి యుండవలెను.

(f) అతడు పనివాడై యుండలెను. సోమరులు దేవునికి పనికిరారు. ఎవడైనను పనిచేయనొల్లని యెడల వాడు భోజనము చేయకూడదని పౌలు ద్వారా ఆయన ఒక ఆజ్ఞను అమలుపరచెను (2థెస్స 3:10). బోధించుటయంటే మంచము మీద పండుకొని యుండుట గాని, యితరుల ఆదాయముపై ఆధారపడియుండి, ,చెయ్యిఎత్తి పని చేయకుండుట గాని కాదు. అది అంతకన్నా ఎక్కువ. ప్రభువు కోరిన రీతిగ ఒకడు పనిచేసిన యెడల అది కష్టపడవలసిన పని. అది అటు యిటు తిరుగుట, ప్రజలను సందర్శించుట,, బోధించుట, వాక్యమును పఠించుట, సత్యవ్యాప్తికై అవుసరమైన వాటినన్నిటిని చేయుట అందు ఇమిడి యున్నవి. ఈ పనిని చేయుటకు పౌలు తన స్వంత చేతులతో కష్టపడుట కిష్టపడెను (1కొరింథీ 4:12). సువార్తను బోధించుటకు నీవు కూడ అట్లే యిష్టపడగలవా ? లేని యెడల, ప్రభువు వినియోగించుకోదగిన బోధకుడవు నీవు కావు.

(g) అతడు ప్రభువునందు ఆసక్తి కలవాడై యుండవలెను. అనగా అతడు బయలు వెళ్ళి బోధించి, ఉపదేశించి ప్రభువు కొరకు ఆత్మలను సంపాదించుటలో ఆతురత కలవాడై యుండవలెను. కూర్చొన్న చోటనే కూర్చుండి, ప్రభు పనిలో ఆసక్తి, ఉద్రేకము లేనివారు బైబిలునందు మనకు కన్పడు బోధకులకు భిన్నమైన వారు (తీతు 2:14).

(h) అతడు ఆత్మల విషయమై అమిత ప్రేమ కల్గినవాడై యుండవలెను. ఇతరులంటే ప్రేమలేని యెడల ఎవడైనను వారికి బోధించి వారి ఆత్మల నెట్లు రక్షించగలడు ? అది కేవలము అసాధ్యమైన పని. దేవుని యెడల; మనుష్యుల ఆత్మల యెడల ప్రేమ కలిగిన వాడే ప్రేమ కలిగి సత్యము చెప్పగలిగిన వాడు (ఎఫెసీ 4:15).

ఒకడు ఇట్టి అర్హతలను, మరియు క్రైస్తవుని యొక్క గుణములను తత్వమును కలిగి యున్ననాడు అతడు బోధకుని పనిచేయుటకు ఆరంభించుటకు ఆలోచింపవచ్చును. (తరువాయి భాగం వచ్చే సంచికలో)

- జె.సి. ఛోట్.

## మిక్కిలి రమ్యమైన ఫలము

## (The Most Beautiful Fruit)

ఆదికాండము 1:22లో దేవుడు జలచరములతోను, ఆకాశపక్షులతోను "ఫలించి అభివృద్ధి చెందుడి" అని చెప్పెను. ఫలము అను మాటకు తియ్యని రసముతో కూడిన ఆహారమని చాలామంది భావింతురు. పండ్ల సువాసనలను మనము పానీయములలోను, ఫలహారములలోను , ఐసుక్రీములలోను, మందుల లోను ఉపయోగింతుము. పండ్ల రంగులను, వాసనలను, మన దుస్తులుంచు బీరువాలలోను మన ఇల్లంతటిలోను చూడగలము.

కీర్తన 17:9లో "ఒకడు తన కనుపాపను కాపాడుకొనునట్లు నన్ను కాపాడుము" అని దావీదు దేవుని నడిగెను (God keep him as the apple of his eye) కంటిపాప లేక కంటిలో గుండ్రముగా యున్న కనుగుడ్డు మధ్య భాగమును ఇంగ్లీషులో apple అంటారు. కంటిపాపగా యుండుట అనగా ప్రత్యేకముగా ప్రేమింపబడుట అని అర్థము. 19వ శతాబ్ద ప్రారంభములో ఇంగ్లీషులో ఒక సామెత కలదు. "An apple a day keeps the doctor away" అనగా రోజుకొక ఆపిల్ పండు తింటే డాక్టరుని దూరంగా ఉంచవచ్చు అని అర్థము.

ప్రాచీన గ్రీసు దేశములో ఒక అందమైన అమ్మాయి బంగారు ఆపిల్ పండు ... సత్కరించ...ేది. ఒకానొక సమయములో అది లంచముగా కూడా ఉపయోగించబడినది గ్రీకు దేశములో ట్రోజన్ యుద్ధములో ట్రాయ్ పట్టణములో

యున్న హెలెన్‌ను పట్టుకొనుటకు చక్రవర్తికి తోడ్పడినందున 'ఏఫ్రొడైట్'కు బంగారు ఏపిల్ ఇవ్వబడినది.

ఏదెను తోటలోని ఒక ఫలము మానవ చరిత్రనే మార్చి వేసినది. ఆదాము హవ్వలకు తోటలోని అన్ని ఫలములను తినుటకు దేవుడు అనుమతించెను. గాని మంచి చెడ్డల తెలివినిచ్చు ఫలములను తినవద్దని చెప్పెను. సాతాను హవ్వను శోధించుటచే ఆమె ఆ ఫలము తినుట వలన పాపము లోకములోనికి ప్రవేశించినది.

బైబిలు అంతటిలోను 'ఫలము' అనునది ఒక ముఖ్యాంశము. మోషే వేగువారిని కనాను దేశమునకు పంపినపుడు వారు దానిమ్మ పండ్లను, అంజూరపు పండ్లను, ఇద్దరు మనుష్యులు దండెతో మోయదగినంత పెద్ద ద్రాక్ష గెలను తెచ్చిరి. "అది పాలు తేనెలు ప్రవహించు దేశము. దాని పండ్లు ఇవి" (సంఖ్యాకాండము 13:27) అని వారు చెప్పిరి. 1సమూ. 25:18లో అబీగయీలు దావీదు సైనికులకు 100 ద్రాక్ష గెలలను 200 అంజూరపు అడలను యిచ్చి వారిని సత్కరించెను.

న్యాయాధిపతులు 9:7-15లో అంజూరపు చెట్టు, ద్రాక్ష తీగలు బోధన సాధనాలుగా వాడబడెను. అబీమెలెకును రాజుగా ఎన్నుకొన్న వివాదాస్పద సంఘటనలో యోతాము చెప్పిన ఉపమానములో ఈ చెట్లు ఇతర చెట్లతో మాట్లాడుచున్నవి. మత్తయి 21:19లో పనిచేయుటను గూర్చి బోధించుటకు యేసు అంజూరపు చెట్టును ఉపయోగించెను. సామె 25:11లో సొలొమోను ఈ విధంగా సలహా ఇచ్చెను. "సమయోచితముగా పలుకబడిన మాట చిత్రమైన వెండి పళ్ళెములో ఉంచబడిన బంగారు పండువంటిది".

హార్బర్ బైబిలు నిఘంటువు ఈవిధంగా చెప్పుచున్నది "పూర్వకాలములో ఒలీవ ఫలమునకు ఒక ప్రాశస్త్యము కలదు. ప్రతీ బోజనములో ఒక తాజా ఒలీవ ఫలమునకు గాని నూనెకు గాని స్థానమున్నది. అది ఆహారములో ఒక ముఖ్యాంశము".

ఎల్లప్పుడు ఆకుపచ్చగా ఉండే ఒలీవ చెట్టు అందముగాను, ఎక్కువ కాలం జీవించేదిగాను, ధృడంగాను ఉండును. కొన్నిసార్లు కొండ చరియలలో రాళ్ళ మధ్య గట్టిగా పట్టుకొని వ్రేళ్ళాడుతూ ఉండును. ఒలీవ చెట్టు ఫలభరితమునకు గుర్తు (కీర్తన 128:3).

అది చక్కని ఫలములు గల పచ్చని చెట్టు.యిర్మి 11:16

దేవుని ఆశీర్వాదమునకు గుర్తు ద్వితీ.కా. 7:13

అది సమాధానమునకు గుర్తు ఆది. 8:11

యేసుక్రీస్తు జీవితములో ఫలమునకు ఒక ప్రాధాన్యత యున్నది. అంజూరపు చెట్టును గూర్చి బోధించేటయే గాక, తాను చిందించిన రక్తమునకు సాదృశ్యముగా ఆయన ద్రాక్షారసము ఉపయోగించెను.

నిఘంటువు వివరించునదేమనగా ఫలము అనగా ఫలితము ఉత్పన్నము లేక ఏదైనా పనియొక్క పర్యవసానము. అంతేకాక ఫలము అనగా తినేగింజలు, కాయగూరలు మరియు విత్తనములుగా గుర్తించవచ్చు.

'బిడ్డలు గర్భఫలము' కీర్త 127:3

'మాటలు నోటి ఫలములు' సామె 12:14

'గుణవతియైన భార్య చేతులార పనిచేయుచు లాభప్రాప్తి నొంధును' సామె 31:16

'రక్షింపబడు ఆత్మ నిత్య జీవార్థమైన ఫలము' యోహా 4:36

'ఒకని ప్రవర్తనను బట్టి వానిక్రియల ఫలము పొందును' యిర్మియా 17:10.

యేసుక్రీస్తు క్రైస్తవులను ద్రాక్ష తీగతో పోల్చెను యోహా 15:2

క్రైస్తవులు ఎలాంటి ఫలమును కలిగియుండాలి ? ఫిలిప్పీ 1:9-11లో పౌలు ఈ విధముగా వివరించెను. "మీ ప్రేమ తెలివితోను సకల విధములైన అనుభవ జ్ఞానముతోను కూడినదై అంతకంతకు అభివృద్ధి పొందవలెనని ఇందువలన దేవునికి మహిమయు స్తోత్రమును కలుగునట్లు మీరు యేసుక్రీస్తు వలననైన నీతిఫలములతో నిండుకొనినవారై క్రీస్తు దినమునకు నిష్కపటులును, నిర్దోషులును కావలెనని ప్రార్థించుచున్నాను".

ఆపిల్ పండు అనేక భాగములను కల్గియుండును. పై తొక్క, గుజ్జు, విత్తనాలు మరియు విత్తనము లోపల క్రొత్త ఆపిల్ మొక్కను ఉత్పత్తి చేయగల జీవము గల పిండము ఉండును. ఇన్ని భాగములు ఆపిల్ పండు కల్గియున్నప్పటికి అది ఒక్క ఫలము మాత్రమే

పౌలు గలతీ 5:22లో ఈలాగు చెప్పుచున్నాడు. 'అయితే ఆత్మఫల మేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము". గమనించండి ఇచ్చట ఆత్మ ఫలమేమనగా అని ఏక వచనములో చెప్పబడినది. ఒక్కొక్కటి ఎన్నుకొనుటకు లేక ఏరుకొనుటకు ఇవి ఆత్మఫలములు కావు. ప్రేమ, సంతోషము, సమాధానము మొదలగునవి. ఒక్క ఫలములోని వేర్వేరు భాగములు.

పౌలు ఎఫెసీ 5:9,10లో "వెలుగు ఫలము సమస్త విధములైన మంచితనము, నీతి సత్యమను వాటిలో కనబడుచున్నది. గనుక ప్రభువుకేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడచుకొనుడి" అని చెప్పెను.

పౌలు కాలమునకు కొన్ని వందల సంవత్సరములకు పూర్వమే ప్రవక్తయైన యెషయా నీతిఫలమును గూర్చి తెలిపెను. "నీతి సమాధానమును కలుగజేయును. నీతివలన నిత్యము, నిమ్మళమును నిబ్బరమును కలుగును" (యెషయా 32:17).

ఒక ఫలమును ఏ ఇతర ఫలముతోనైనా పోల్చినపుడు దానికి ఒక ప్రత్యేకమైన

తేడా కన్పించును. ప్రతీ క్రైస్తవుడు కూడా ప్రత్యేకించబడినవాడు. మనము ప్రతి నిత్యము నిత్యజీవము వైపునకు నడవాలి. కళంకము లేని పరిపక్వత గల ఫలములను కల్గియుండాలి. మన జీవిత కాలములో ప్రతీ విషయములోను ఆత్మ ఫలమును ఫలించుటకు ప్రయత్నం చేయాలి. అట్టి ఫలమును కల్గియున్నచో అది మిక్కిలి రమ్యమైన ఫలము !!

- ఫ్రేన్సిస్ పార్ (VOT)

## బైబిలు కరస్పాండెన్స్ విద్యార్థులకు ముఖ్య గమనిక

సత్యవాణి ద్వారా లక్షలాది ప్రజలు బైబిలు పాఠములను ఉచితముగా పోస్టు ద్వారా పొందుచు సత్యమును గ్రహించుచున్నారు. కొందరికి పాఠములు సకాలములో అందుట లేదనియు, అసలే అందుట లేదనియు మాకు తెలియ వచ్చినది. మీరు పూర్తిచేసిన ప్రశ్నాపత్రములు ఒక్కోసారి మాకు అందకపోవచ్చును. గనుక వెంటనే తదుపరి పాఠములను మేము పంపలేము. లేదా మేము మీకు పంపిన పాఠములు మీకు కూడ అందియుండక పోవచ్చును. గనుక మీరు మాకు ప్రశ్నాపత్రములను పూరించి పంపుట జరుగదు. అందువలననే మీకు మా వద్ద నుండి 15 రోజులలోగా పాఠములు అందకపోయిన యెడల మీకియ్యబడిన రిఫరెన్సు నంబరును మాకు వ్రాస్తు ఒక కార్డు ద్వారా తెలియజేయండి. మీరు మాకు రిఫరెన్సు నంబరుతో సహా తెలియజేయకపోతే మేము ఏమీ చేయలేము.

బేసిక్ బైబిలు కోర్సు పూర్తి చేసిన ప్రతివారికి ఉచితముగా బైబిలు బహుమతిగా ఇచ్చుచున్నాము. ఒకవేళ మీకు సర్టిఫికేట్ మాత్రమే అందియుండి, బైబిలు అందనిచో మాకు వ్రాయండి. మీ రిఫరెన్సు నంబరు వ్రాయుట మరచిపోవద్దు. బైబిళ్లను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపుచున్నాము. గనుక మీకు అందకపోతే మేము తగుచర్య తీసికొనే అవకాశం కలుగును.

మీరు బేసిక్ బైబిలు కోర్సు ద్వారా ఆత్మీయముగా మేలు పొందితే మీ బంధువులు, మిత్రులను ఆ కోర్సులో చేర్పించండి. వారి అడ్రసులను మాకు పంపితే వెంటనే వారికి బైబిలు పాఠములను పంపించగలము. ఈ దిగువ అడ్రసుకు వారు గాని, మీరు గాని వెంటనే వ్రాయండి.

**SATYA VANI**

**P.O. BOX. 80, KAKINADA - 533 001 A.P.**

ఇయ్యబడిన అంశముపై చక్కటి వాక్యపరిచర్య చేసిరి.

రక్షింపబడుటకు ఒకడు క్రీస్తు సంఘ సభ్యుడు కానవుసరంలేదు. ఏ సంఘము లో యున్నను ఫరవాలేదని ఈలోకస్థుల వాదన, బైబిలయితే అట్లు బోధించుట లేదు. ప్రభువు రక్షించుననునది వాస్తవము. "ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడు మనలను నియమించెను గాని ఉగ్రత పాలగుటకు నియమింపలేదు" (1థెస్స 5:9). అయితే ప్రభువు రక్షించేది ఎక్కడ ?

దేవుడు నోవహు కాలములోని ప్రజలను, పాపమును జలప్రళయము ద్వారా నాశనము గావించెను. గాని, నోవహును అతని కుటుంబమును ఒక ఓడద్వారా రక్షించెను. ఆ ఓడలో ప్రవేశించుటకు ఎవరైతే యిష్టపడిరో వారినే ఆయన రక్షించెను. ఓడకు వెలుపల యున్నవారందరు ఎంత ఘనులైనను సరే నశించిరి. దీనిని బట్టి రక్షణ ఓడలో యుండెను. జలప్రళయములో నుండి రక్షింపబడే స్థావరము ఇంకొకటి యేదీలేదు. అలాగే ఈనాడు పాపములనుండి దేవుడు రక్షణను ఎక్కడ వుంచెను? ఎవరైతే ఆయన రక్షణ షరతులకు లోబడుదురో వారినే ఆయన రక్షించును.మరియు రక్షణ పొందుచున్న వారినందరినీ ఆయన తన సంఘములో చేర్చును. రక్షణపొందిన వారిలో ఎవడును ఆయన సంఘమునకు వెలుపల యుండడు. వెలుపలయున్నవాడు నశించిన స్థితిలో యుండును.

సంఘము క్రీస్తుయొక్క శరీరమై యున్నది (కొలస్స 1:18). క్రీస్తురక్తము మనలను ప్రతి పాపము నుండి విముక్తులనుగా చేయును. క్రీస్తురక్తము ఆయన శరీరములో ప్రసరించును. గనుక క్రీస్తురక్తము ద్వారా విమోచింపబడాలంటే ఆయన శరీరమైన సంఘములో యుండాలి. ఆయన శరీరములో ఒకడు బాప్తిస్మము ద్వారా ప్రవేశించును (గలతీ 3:27). క్రీస్తు శరీరములో గాక వేరొక శరీరములో యుంటే పాప విముక్తి కలుగదు. ఏలయనగా మరియెవని వలనను రక్షణ కలుగదు. ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున మనము రక్షణ పొందలేము (అపొ.కా. 4:12).

మేడూరులో క్రీస్తుసంఘము, సోదరులు సి.హెచ్. కాంతారావ్ గార్లు వచ్చిన వారికి చక్కటి భోజనపానాదులు నేర్పాటు చేసిరి. సదస్సు అనంతరము మరి

రెండు రోజులు మేడూరులో సువార్త కూటములు జరిగెను. సదస్సు సోదరులు ఐ.ఇశ్రాయేలు గారి ప్రార్ధనతో ముగిసెను. తదుపరి సోదరులు కాంతారావ్ గారు వందన సమర్పణ చేయగా జాషువా గూటం గారు ఖమ్మం జిల్లా మణుగూరును దర్శించుటకు వెళ్లిరి. సువార్తికులు తమ తమ గ్రామములకు సంతోషముతో తిరిగి వెళ్లిరి.

ఫిబ్రువరి 26,27,28 తేదీలలో కాకినాడలో ఒరియా భాషమాట్లాడు వారికి బైబిలు సెమినార్ ఏర్పాటు చేయబడెను. ఈ పత్రిక ముద్రించు సరికి ఒరిస్సా రాష్ట్రము నుండి వచ్చు వందలాది సభ్యులకు స్వాగతం పలుకడానికి, సెమినార్ జయప్రదం చేయడానికి సోదరులు జాషువా గూటం గారు, వారి బృందము తగు ఏర్పాట్లు చేయుచున్నారు. ఒరియా బైబిలు సెమినార్‌లో ముఖ్య ప్రసంగీకునిగా సోదరులు ఐరా రైస్ గారు వచ్చుచున్నారు.

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada - 533 004.
Editor : Joshua Gootam

RNI Regd. No. 69973/98
PRINTED BOOK - BOOK POST

From:
SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

To